సాక్షి వికారాబాద్

గురువారం । 31 । ఆగస్టు । 2023



మోక్షమెప్పుడో ?

కొత్త రేషన్ కార్డుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా దరఖాస్తుదారులకు నిరాశే ఎదురవుతోంది. 8లో▸



సీఎం పునరాలోచించాలి

చేవెళ్ల అభ్యర్థిత్వంపై సీఎం పునరాలోచించాలని నవాబుపేట బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు కోరారు. 8లో▸



క్రీడలతో ఉజ్వల భవిష్యత్

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విద్యార్థులకు సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 34 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అర్హులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఎక్స్‌రే సేవలు



ఎక్స్‌రే సెంటర్‌లో పూజలు చేస్తున్న కేవీఎస్ మూర్తి

తాండూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఎక్స్‌రే సేవలు బుధవారం అందుబాటులోకి వచ్చాయి. ఆరు నెలల క్రితం ఎక్స్‌రే యంత్రం పాడైపోయింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజుల క్రితం ఆరోగ్య శాఖ అధికారులు కొత్త ఎక్స్‌రే యూనిట్‌ను ఇక్కడికి పంపారు. బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ కేవీఎస్ మూర్తి పూజలు చేసి ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభించారు.

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా కేవీఎస్ మూర్తి

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కేవీఎస్ మూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించే సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో ఆస్పత్రి సీనియర్ సర్జన్‌గా ఉన్న డాక్టర్ కేవీఎస్ మూర్తికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం

పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్



తాండూరులో ప్రచారం చేస్తున్న బీఎస్పీ నాయకులు

తాండూరు: బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యమూర్తితో కలిసి పట్టణంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులతో మాట్లాడి తమను ఆదరించాలని కోరారు. తాండూరు అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీ చేస్తున్న ఈ గడ్డ బిడ్డనైన తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో బీఎస్పీ పవనాలు వీస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ అంజాద్ అలీ, నాయకులు అరుణ్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

సెకెండ్ ఏఎన్‌ఎంల డిమాండ్

అనంతగిరి: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సెకెండ్ ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం 16 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న వారు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇతర శాఖల తరహాలోనే తమను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. ఏళ్ల తరబడి తక్కువ జీతాలకు పని చేస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఏఎన్‌ఎం యూనియన్ జిల్లా నాయకులు లీలావతి, లలిత, పాపమ్మ, వెంకటమ్మ, రజియా, సంతోష, భారతి, సుహాసిని, రాజకుమారి, షబానా, విజయలక్ష్మి, సత్యమ్మ, మంజుల, పుణ్యమ్మ, పద్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు మార్కెట్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

అన్నాచెల్లెళ్ల అనుబంధం.. రాఖీ పౌర్ణమి

రాఖీ పౌర్ణమి అనగానే గుర్తుకు వచ్చేది అన్నా చెల్లెళ్ల అనుబంధం. మాకు మీరే రక్ష అంటూ అక్క చెల్లెళ్ల.. అన్నదమ్ములకు రాఖీ కట్టడం ఆనవాయితీ. సోదరులు కూడా మీకు తోడుంటామని మిఠాయి తినిపించి బహుమతులు ఇస్తారు. గురువారం రాఖీ పండుగ కావడంతో బుధవారం వికారాబాద్‌లోని రాఖీ దుకాణాలు మహిళలు, యువతులతో కళకళలాడాయి.



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు, యువతులు

తాండూరు సీటు హాటు గురూ!

కాంగ్రెస్ టికెట్ కోసం ఆరుగురు దరఖాస్తు

- ఆశావహుల్లో ఉత్కంఠ
- జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు 10మంది పోటీ
- పరిగి నుంచి ఇద్దరు
- కొడంగల్, వికారాబాద్‌ల నుంచి ఒక్కొక్కరు
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన నేతలు



వికారాబాద్: జిల్లాలో హస్తం పార్టీ టికెట్లు ఆశిస్తున్న నేతలు ఇప్పటికే దరఖాస్తు చేసుకోగా అధిష్ఠానం అభ్యర్థుల ఎంపిక కోసం స్క్రీనింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. అధికార బీఆర్ఎస్ సిట్టింగులకే సీట్లు కేటాయించడంతో టికెట్ల పంచాయితీ ఒక్కసారిగా బయటపడింది. కాంగ్రెస్ జాబితా విడుదలైతే ఆ పార్టీలో కూడా టికెట్ల పంచాయితీ తలెత్తే అవకాశం లేకపోలేదు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల నుంచి కాంగ్రెస్ టికెట్లు ఆశిస్తున్న వారిని నుంచి అధిష్ఠానం దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ మొదటి వారంలో కాంగ్రెస్ మొదటి జాబితా ప్రకటిస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే గాంధీ భవన్‌లో స్టీరింగ్ కమిటీ కసరత్తు చేసిన విషయం తెలిసిందే. పోటీ ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల నుంచి ముగ్గురు ఆశావహుల పేర్లను ఢిల్లీ స్టీరింగ్ కమిటీకి పంపనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 10 మంది కాంగ్రెస్ టికెట్లు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాల నుంచి ఒక్కొక్కరు దరఖాస్తు చేసుకోగా, పరిగి నుంచి ఇద్దరు, తాండూరు నుంచి అత్యధికంగా ఆరుగురు నేతలు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్‌లోనూ పోటీ అనివార్యంగా కనిపిస్తోంది.

నాలుగు సీట్లకు 10 మంది దరఖాస్తు

ఇన్నాళ్లు అధికార బీఆర్ఎస్‌లో తాండూరు టికెట్ కేటాయింపు అంశం రాష్ట్రంలోనే సంచలనంగా మారి వేడి రాజేయగా, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ విషయంలోనూ అదే పరిస్థితి నెలకొంది. కొడంగల్ నుంచి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దరఖాస్తు చేసుకోగా, వికారాబాద్ నుంచి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. పరిగి నుంచి డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి తోపాటు డీసీసీ ప్రధాన కార్యదర్శి కే హన్మంతు దరఖాస్తూ చేసుకున్నారు. ఇక తాండూరు నుంచి ఏకంగా ఆరుగురు నేతలు దరఖాస్తు దాఖలు చేశారు. పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్, పీసీసీ జనరల్ సెక్రటరీ రఘువీరారెడ్డి, పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీరామ్‌రెడ్డి తాండూరు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఈ టికెట్ ఎవరికి దక్కుతుందా అనే విషయం ఉత్కంఠగా మారింది.

పోటీ అధికం

కొడంగల్, వికారాబాద్‌ల నుంచి ఒక్కొక్కరే దరఖాస్తు చేసుకోవడంతో అక్కడ వారికే టికెట్ దక్కనుంది. పరిగి నుంచి ఇద్దరు దరఖాస్తు చేసుకోగా అక్కడ బలమైన నాయకుడు డీసీసీ అధ్యక్షుడు టీఆర్ఆర్ బరిలో ఉండడంతో ఆయనకే టికెట్ దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఒక వేళ బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో తనను కూడా పరిగణలోకి తీసుకోవాలని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బీసీ నాయకుడు, ప్రస్తుత డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు అధిష్ఠానాన్ని కోరుతున్నారు. అయితే తాండూరు హస్తం సీటు కోసం ఆరుగురు పోటీ పడుతున్న నేప థ్యంలో సీటు ఎవరికి దక్కుతుందా అనే విషయం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మా రింది. 2018లో కాంగ్రెస్‌లో గెలిచి పార్టీ మారిన 12 స్థానాల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపాలని ఆ పార్టీ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన కేఎల్ఆర్ తాండూరు నుంచి దరఖాస్తు చేసుకోవడం ఇందులో భాగమేనని చర్చ జరుగుతోంది. ఆయనకు టికెట్ కేటాయిస్తే అధికార బీఆర్ఎస్ అభ్యర్థికి గట్టి పోటీ ఖాయమని,గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ మొదటి జాబితాలో జిల్లాకు చెందిన ముగ్గురు రేవంత్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి పేర్లు ఉండే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.తాండూరు టికెట్ కోసం పోటీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మొదటి జాబితాలో అభ్యర్థి పేరు ఉండకపోవచ్చు ని తెలుస్తోంది. ఒక వేళ అధిష్ఠానం కేఎల్ఆర్ వైపే మొగ్గు చూపితే ఆ పేరు కూడా మొదటి జాబితాలోనే ఉండే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

క్షేత్రస్థాయి నుంచే అవగాహన పెంచుదాం

- ఓటు హక్కుపై సదస్సులు నిర్వహించండి
- ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ ఆదేశం

వికారాబాద్ అర్బన్: గ్రామస్థాయి నుంచే ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఎన్నికల సిబ్బందికి సూచించారు. బుధవారం కలెక్టర్ తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 19వ తేదీ వరకు కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో 18 నుంచి 19 సంవత్సరాలు నిండిన యువతి యువకుల ఓటరు నమోదు తక్కువగా ఉందని, వారిలో చైతన్యం తేవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి మార్పులు, చేర్పులు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులు, 80 సంవత్సరాలు పైబడిన వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం ఉందని, ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఆ సదుపాయం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. వీఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు సమన్వయంతో పని చేసి వంద శాతం ఓటరు నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్ పాల్గొన్నారు.

ఓటు వేయడం మన బాధ్యత

కొడంగల్: ఓటు హక్కు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కని,దాన్ని సద్వినియోగం చేసుకోవడం మన బాధ్యతని అడిషనల్ కలెక్టర్, కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ లింగ్యా నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరుగా నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటుకు ఎంతో శక్తి ఉందన్నారు. ఓటుతో మంచి నాయకులను ఎన్నుకునే అవకాశం ఉందన్నారు.మంచి ప్రభుత్వాలు ఏర్పడితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, డీటీలు సురేష్, శివకుమార్, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.అనంత రం తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు.ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.ఓటరు జాబితాలో తప్పు లు ఉంటే సవరించుకోవచ్చని సూచించారు. అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18ఏళ్లునిండే వారు ఓటు హక్కు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు రమేష్‌బాబు, కృష్ణంరాజు, బషీర్, మహమూద్, శంకర్ నాయక్,చంద్రప్ప, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పార్టీలు సహకరించాలి

తాండూరు రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిద పార్టీల ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. పార్టీలు సహకరిస్తే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. సెప్టెంబర్ 19వ తేదీ వరకు కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐ రాజిరెడ్డి, నాయకులు నయీం, సుదర్శన్ గౌడ్, గోపాల్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెసర్లకు రికార్డు ధర

- క్వింటాలుకు గరిష్టంగా రూ.10,055
- మద్దతు ధర రూ. 7,500 మాత్రమే
- బహిరంగ మార్కెట్ వైపే మొగ్గు చూపుతున్న రైతులు



బషీరాబాద్: ఈ సారి పెసర్లకు మార్కెట్‌లో రికార్డు ధర లభిస్తోంది. ఖరీఫ్‌లో పంట చేతికి రాగా ప్రస్తుతం విక్రయాలు ప్రారంభించారు. క్వింటాలు పెసర్లు రూ.10,055 గరిష్ట ధర పలుకుతున్నట్లు బషీరాబాద్ మార్కెట్ కమిటీ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. నాణ్యతను బట్టి కనిష్ట ధర 7,500 ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుత వానాకాలంలో సుమారు 11వేల ఎకరాల్లో పెసర పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని రైతులు ఎక్కువగా అంతర పంటగా పెసర సాగు చేశారు. అయితే ఆగస్టు మొదటి వారంలో కురిసిన ఎడతెరపి లేని వర్షాలకు పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. దిగుబడి పడిపోవడంతో ధర అమాంతం పెరిగింది. మరోవైపు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.7,755లే ఉంది. బహిరంగ మార్కెట్‌లో మాత్రం గరిష్ట ధర రూ. 10వేలకు పైగా ఉండడంతో రైతులు అక్కడే విక్రయిస్తున్నారు.



నిరసన ర్యాలీ

అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించిన పోస్టులకు తగ్గకుండా డీఎస్సీ నోటిఫికేషన్ ఉండాలని డీఎడ్, బీఎడ్ నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఖాళీలు తగ్గించి చూపించడంపై బుధవారం వికారాబాద్‌లో నిరసన ర్యాలీ తీశారు. పరీక్షలకు నాలుగు నెలల సమయం ఉండేలా తేదీలు ఖరారు చేయాలని వారు కోరారు.

– అనంతగిరి

2వేల మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- ఆన్‌లైన్ ద్వారా లక్కీ డ్రా
- కలెక్టర్ హరీష్, ఎమ్మెల్యేల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక
- విడతల వారీగా అందరికీ ఇళ్లు ఇస్తాం: మంత్రి సబితారెడ్డి



ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకే సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని మంత్రి సబితారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్ హరీష్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేర్‌లింగంపల్లి, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన 2 వేల మందిని ఎంపిక చేశారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనే సంకల్పంతో ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ వేదికగా లక్కీ డ్రా నిర్వహించారు. ఇందుకోసం 93,899 దరఖాస్తులు రాగా.. 12,479 మందిని అర్హులుగా గుర్తించి.. ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 500 మంది చొప్పున సెలెక్ట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల కోసం కొల్లూరులో సకల సౌకర్యాలతో కట్టిన ఇళ్లను సీఎం కేసీఆర్ ఇటీవలే ప్రారంభించారని తెలిపారు. అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు అందిస్తామని స్పష్టంచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు వంటి అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించామన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్ఐసీ సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన ర్యాండమైజేషన్ సాఫ్ట్ వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించామని స్పష్టంచేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పొందిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే వారికి గృహలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేస్తుందని స్పష్టంచేశారు. ఇళ్ల కేటాయింపులో ఎలాంటి పైరవీలకు తావు లేదని, దళారులను నమ్మొద్దని మంత్రి సూచించారు. ఆధార్ కార్డు అనుసంధానం చేస్తుండటంతో ఒక వ్యక్తి రెండుసార్లు లబ్ధి పొందే అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో బీఆర్ఎస్‌దే గెలుపు

మహేశ్వరం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉప్పుగడ్డ, కొత్త తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం నగరంలోని మంత్రి నివాసంలో ఆమె చేతులమీదుగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపిస్తాయన్నారు. కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్‌నాయక్, రమేష్, రాజు, రవి, రమేష్, శివ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, మాజీ జెడ్పీటీసీ ఈశ్వర్‌నాయక్, సంత్ సేవాలాల్ గుడి చైర్మన్ సీతారామ్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు సేవ్యానాయక్, రాజునాయక్, రవీందర్‌నాయక్, రాజ్‌కుమార్ నాయక్, సురేష్‌నాయక్, దేశ్యానాయక్, శంకర్‌నాయక్, కల్యాణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు టెంకాయల విక్రయానికి వేలం

పెద్దేముల్: మండల పరిధిలోని తట్టెపల్లి శివారులో ఉన్న అంబురామేశ్వర ఆలయం వద్ద గురువారం టెంకాయల అమ్మకం, పార్కింగ్‌కు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉదాల వెంకటేశం, కార్యదర్శి చిట్లపల్లి అంజప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ వేలంలో పాల్గొనే భక్తులు రూ.వెయ్యి చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్న వారు అడ్వాన్స్ చెల్లించాలని వివరించారు.

బస్సు టికెట్ ఆధారంగా సెల్ ఫోన్ లభ్యం



లక్ష్మణ్‌కు ఫోన్ ఇస్తున్న బస్టాండ్ ఇన్‌చార్జి రాజు

మోమిన్‌పేట: బస్సులో మరిచిపోయిన సెల్ ఫోన్ టికెట్ ఆధారంగా లభ్యమైంది. గ్రామానికి చెందిన మోచ లక్ష్మణ్ మంగళవారం సాయంత్రం 7.30గంటల ప్రాంతంలో సదాశివపేట నుంచి వికారాబాద్ వెళ్లే బస్సు ఎక్కి మోమిన్‌పేటలో దిగాడు. దిగే ముందు ఫోన్‌ను సీటుపైనే పెట్టి మరిచి ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం ఆయన ఫోన్ లేకపోవడంతో స్థానిక బస్టాండ్ ఇన్‌చార్జి రాజుకు ఫిర్యాదు చేశాడు. ఆయన టికెట్ ఆధారంగా బస్ కండక్టర్ తిరుపతిరెడ్డికి ఫోన్ చేయడంతో బస్సులోనే ఉందని బుధవారం అందజేస్తానని చెప్పాడు. దీంతో బస్టాండ్ ఇన్‌చార్జి రాజు బాధితుడికి బుధవారం ఫోన్ అందజేశాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



పుల్లప్ప మృతదేహం

దౌల్తాబాద్: అడవిపందుల బెడద నుంచి పంటను కాపాడేందుకు పెట్టిన విద్యుత్ కంచె తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుర్వ బండగుండ పుల్లప్ప(45) తన పొలంలోవేరుశనగ పంట కోసి కుప్ప పెట్టాడు. ఉదయం వరిపొట్టు తీసుకువచ్చేందుకు వెళ్లిన ఆయనకు విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ రాములు, ఎస్ఐ రమేశ్ ఘటనాస్థలిని పరిశీలించి పంచనామా చేశారు. మృతుడి భార్య అనంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వికారాబాద్ వాసికి గోల్డ్ మెడల్

అనంతగిరి: జాతీయస్థాయి షోటో ఖాన్



సత్యనారాయణను అభినందిస్తున్న రామయ్యగూడ వాసులు

కరాటే స్పైరింగ్ విభాగంలో వికారాబాద్ పట్టణ చెందిన దుద్యాల సత్యనారాయణ గోల్డ్ మెడల్ సాధించాడు. గత శనివారం, ఆదివారాల్లో ముంబైలో జరిగిన పోటీల్లో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించాడు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన సత్యనారాయణకు హీరో సుమన్, జపాన్ కరాటే మాస్టర్లు ప్రసంశ పత్రం అందజేసి అభినందించారు. విషయం తెలుసుకున్న రామయ్యగూడ వాసులు బుధవారం శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు సురేష్, యాదయ్య, అంజయ్య, శ్రీనివాస్, నర్సింలు, రాజు, రమేష్ ఉన్నారు.

మున్నూరుసోమారం విద్యార్థినికి మెడికల్ సీటు



రితికా రాచెల్

ధారూరు: మండల పరిధిలోని మున్నూరు సోమారం విద్యార్థిని రితికా రాచెల్ ఎంబీబీఎస్ సీటు సాధించింది. గ్రామానికి చెందిన పసుల రాజు, స్నేహలత దంపతుల కూతురు ఉచిత మెడికల్ సీటు సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నవాబుపేట: బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వట్టిమీనేపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా, కంది మండలం ఆలూరు గ్రామానికి చెందిన తలారి విజయ్ (35) బుధవారం సాయంత్రం నవాబుపేట మండలం మైతాఫ్ ఖాన్‌గూడ నుంచి నవాబు పేట వైపు బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. వట్టిమీనేపల్లి వద్దకు రాగానే బైకు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సంబంధీకుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపారు.

మోక్షమెప్పుడో?

- కొత్త రేషన్ కార్డులు దరఖాస్తులకే పరిమితం
- ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న పేదలు
- ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న అర్హులు

దౌల్తాబాద్: కొత్త రేషన్‌కార్డుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా దరఖాస్తుదారులకు నిరాశే ఎదురువుతోంది. దీనికితోడు కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ మొదలైందంటూ దరఖాస్తు ఫారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రజాప్రతినిధులు సైతం వీటిని పోస్టు చేస్తుండడంతో పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అలాంటిదేమిలేదంటూ ఖండించడంతో దరఖాస్తుదారులు నిరాశకు గురయ్యారు.

పెండింగ్‌లోనే దరఖాస్తులు

ప్రభుత్వం పేదలకు అందించే సంక్షేమ పథకాలకు



అర్హులను నిర్ణయించడంలో తెల్లరేషన్ కార్డుదే ప్రథమ స్థానం. పల్లెల్లో పట్టణాల్లో ప్రజలకు చౌక ధరలకు బియ్యం, పప్పులు అందించడానికి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో అర్హులకు రేషన్‌కార్డులు అందిస్తున్నారు. నాలుగేళ్లుగా కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ పెండింగ్‌లో ఉండడంతో కోసం దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మండల పరిధిలోని 33 గ్రామ పంచాయతీలుండగా 30 రేషన్‌షాపుల ద్వారా 12,092 మందికి రేషన్ అందుతోంది. 1,600 మందికిపైగా కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకోగా.. 450 కార్డులు డీఎస్ఓ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రేషన్‌కార్డులు మంజూరులో జాప్యం చేయడంతో అర్హులు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందుకోలేకపోతున్నారు.

నష్టపోతున్న అర్హులు

ఉన్నతాధికారుల జాప్యంతో అర్హులు నష్టపోతున్నారు. వైట్ రేషన్ కార్డులున్న వారికే ప్రభుత్వ పథకాలకు అర్హులు. దీంతో అర్హత ఉన్నా కార్డులు లేక పేదలు నష్టపోతున్నామని వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

కొత్తగా ఆహారభద్రత కార్డుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కొత్త కార్డులను మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తాం.

– చాంద్‌పాషా, డిప్యూటీ తహసీల్దార్, దౌల్తాబాద్

బైక్ దొంగలకు రిమాండ్

రూ.4లక్షల విలువైన 10 వాహనాలు స్వాధీనం

పహాడీషరీఫ్: బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువైన పది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పహాడీషరీఫ్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ బి.శ్రీనివాస్ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఫలక్‌నుమా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన డెలివరీ బాయ్ మహ్మద్ అబ్దుల్ జుబేర్(22), మెడికల్ షాప్‌లో పనిచేసే శాస్త్రీపురం నివాసి మహ్మద్ పర్వేజ్ అహ్మద్(25), కాలాపత్తర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ మహ్మద్ హుస్సేన్(22), ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేసే గోల్కొండకు చెందిన సయ్యద్ వాజిద్ అలీ(26) వ్యసనాలకు బానిసలయ్యారు. వచ్చే వేతనాలు వారి ఖర్చులకు సరిపోక పోవడంతో దొంగతనాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌లను చోరీలు చేయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు రూ.4లక్షల విలువైన పది ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో పహాడీషరీఫ్ క్రైం టీం తీగలకుంటలో మాటు వేయడంతో నిందితులు చిక్కారు. వారిని విచారించగా పహాడీషరీఫ్, జవహర్‌నగర్, బండ్లగూడ, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్, సనత్‌నగర్, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలు చేసినట్లు అంగీకరించారు. ఈ సమావేశంలో డీఐ బి.సత్యనారాయణ, డీ ఎస్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేలుడు కేసులో ఇద్దరికి..

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో బ్లాస్టింగ్ మెటీరియల్ పేలుడుకు కారకులైన ఇద్దరు వ్యక్తులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు. వివరాల ప్రకారం .. గ్రామంలో ఈ నెల 28న యూజీడీ పనులు చేపట్టిన కాంట్రాక్టర్, బ్లాస్టింగ్ పనులు చేసే వర్కర్ బ్లాస్టింగ్ మెటీరియల్‌ను నిర్లక్ష్యంగా వదిలేసి వెళ్లారు. ప్రమాదవశాత్తు పేలుడు సంభవించి ఇద్దరు వ్యక్తులు గాయపడగా పలువురి ఇళ్లు దెబ్బతిన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్ సాయిబాబా, బ్లాస్టింగ్ వర్కర్ అశోక్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అధికారుల ఆదేశాలు పట్టవేనా..!

- నోటీసులిచ్చినా మారని మాంసం దుకాణాలు తీరు
- నేటికీ కానరాని ధరల పట్టిక
- అధిక రేట్లకు అమ్మకాలు

పెద్దేముల్: మటన్, చికెన్ షాపుల వద్ద పరిశుభ్రత పాటించడం లేదని, దుకాణాల యజమానులు అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో పంచాయతీ అధికారి భాస్కర్ మాసం దుకణాల్లో ధరల పట్టిక తప్పక ఏర్పాటు చేయాలని పదిరోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. కానీ నేటికీ ఏ ఒక్క దుకాణంలోనూ ధరల పట్టిక కనిపించడం లేదు. దీంతో అధికారుల ఆదేశాలు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మార్కెట్ కన్నా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారంటూ వాపోతున్నారు. పశువైద్యాధికారుల ఆదేశాల లేకుండా ఇష్టం వచ్చిన మాసం విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ఉన్నతాధికారులు స్పందించి మేలైన మాంసం విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఎంపీఓ షేక్ సుస్మాకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఏ ఒక్క రోజు తనిఖీలు చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

'2023-24' జోనల్ క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులుగా ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దేముల్: పెద్దేముల్ జోన్ పరిధిలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు పెద్దేముల్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ జోనల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం పెద్దేముల్ జెడ్పీహెచ్ఎస్ మైదానంలో నిర్వహించిన క్రీడాకారుల ఎంపిక ప్రశాంతంగా కొనసాగిందన్నారు. జోన్ పరిధిలోని కోట్‌పల్లి, పెద్దేముల్, ధారూరు మండలాల పరిధిలోని 24 పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. మొదటి రోజు అండర్–14, 17 విభాగంలో కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. మరో రెండు రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీ రాధాకృష్ణ, రాజు, గోపిక, భాగ్యలక్ష్మి, ప్రమోద్, విజయభాస్కర్, అంబదాస్, లక్ష్మయ్య, వెంకటరాం, ప్రశాంత్ పాల్గొన్నారు.

'పట్నం'కు శుభాకాంక్షల వెల్లువ



కొడంగల్: పుష్పగుచ్ఛం అందజేస్తున్న మధుసూదన్‌రావు



అనంతగిరి: మంత్రిని సన్మానిస్తున్న వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్



తాండూరు: మహేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అమాత్యుడికి నేతలు, అభిమానుల అభినందనలు



మంత్రికి రాఖీ కడుతున్న ఎంపీపీ కరుణ



తాండూరు: మంత్రి మహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తాండూరు: రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర బీఆర్ అంబేడ్కర్ సచివాలయ భవనంలోని మొదటి అంతస్తులో కుటుంబ సమేతంగా వేద పండితుల సమక్షంలో పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి మంత్రి సతీమణి జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, కుమారుడు రినీష్‌రెడ్డి, కూతురు, అల్లుడితో పాటు పలువురు కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం తన చాంబర్‌లో మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, బాల్క సుమన్, అంజయ్యయాదవ్, యాదయ్య, కృష్ణారావు, ప్రకాశ్‌గౌడ్, ఆనంద్‌లు మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తాండూరు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మంత్రిని సన్మానించారు.



అనంతగిరి: శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల దంపతులు



తాండూరు రూరల్: మంత్రికి పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్ అభినందనలు



అనంతగిరి: పుష్పగుచ్ఛం అందజేస్తున్న వడ్ల నందు

షాద్‌నగర్ వేదికగా బీసీ డిక్లరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్

- బడుగుల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం
- కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మావతి కన్వెన్షన్ హాలులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఇప్పటికే రైతు, యూత్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్లు విడుదల చేశామని వివరించారు. షాద్‌నగర్ వేదికగా త్వరలోనే బీసీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తామని చెప్పారు. సెప్టెంబర్ మొదటి వారంలో నిర్వహించే ఈ సభకు పార్టీ అగ్రనేతలతో పాటుగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్య విచ్చేస్తారని చెప్పారు. సీఎం కేసీఆర్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి గద్దె దించుతామని అన్నారు. కేంద్రంలో బీజేపీ దుర్మార్గపు పాలన చేస్తుంటే రాష్ట్రంలో కేసీఆర్ రాక్షసపాలన చేస్తూ ప్రజా ధనాన్ని దోచుకొని దాచుకుంటున్నారని ఆరోపించారు. కర్ణాటక స్ఫూర్తితో తెలంగాణలోనూ విజయం సాధిస్తామన్నారు. దేశం వ్యాప్తంగా ఓబీసీ ప్రకారం కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ప్రదీప్, సంజీవ్, యాదయ్యయాదవ్, రఘు, బాబర్‌అలీఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, చంద్రశేఖర్, రాజు, జంగ నర్సింహయాదవ్, జగదీశ్వరప్ప, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు మహిళలకు బైండోవర్

యాచారం: నాటు సారాయి తయారీ చేస్తున్న మంతన్‌గౌరెల్లి, తక్కల్లపల్లి తండాకు చెందిన ఏడుగురు మహిళలను బుధవారం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సారాయి తయారు చేసే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు.



మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి

సభ్యత్వం లేని వారు అసమ్మతి నేతలా..?



తలకొండపల్లిలో సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు

- స్థాయి మరచి మాట్లాడడం సరికాదు
- మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి: బీఆర్ఎస్‌లో సభ్యత్వం లేనివారు.. నియోజకవర్గంతో సంబంధం లేని వారు అసమ్మతి నేతలమంటూ సమావేశాలు నిర్వహించడం సరికాదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ నర్సింహ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై విమర్శలు చేసిన వారంతా ఇతర పార్టీలకు చెందిన వారే అన్నారు. వారు కల్వకుర్తి బీఆర్ఎస్ టికెట్ గురించి మాట్లాడటం, అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఈ సమావేశానికి హాజరవ్వడమే ఇతర పార్టీలకు చెందిన వారు సమావేశం ఏర్పాటు చేశారని అనడానికి నిదర్శనమన్నారు. 2014లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పోటీ చేసినప్పుడు, ప్రస్తుత నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్ ఆనాడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకులంతా ఇతర పార్టీ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. పార్టీ వ్యతిరేకులు ఎమ్మెల్యేను ఏ అధికారంతో ప్రశ్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసమ్మతి నేతల్లారా ఖబడ్దార్.. అధిష్టానం తగు చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హయాంలోనే రూ.300 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఇక్కడ జైపాల్‌యాదవ్ గెలుపొందడం, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడడం ఎవరూ ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబర్ రహ్మాన్, సర్పంచ్ లలిత, జ్యోతయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్, వెంకటయ్య, రాములు, యాదయ్య, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్, హరిమోహన్‌రెడ్డి, కుమార్, మధు, జంగయ్య, పాండు, శ్రీశైలం, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల టికెట్‌పై సీఎం పునరాలోచించాలి

- ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు, నవాబుపేట బీఆర్ఎస్ నాయకులు
- కేఎస్ రత్నంకు కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నవాబుపేట బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల: చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థిత్వంపై సీఎం కేసీఆర్ పునరాలోచించాలని నవాబుపేట బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు కోరారు. ఈ మేరకు వారు చేవెళ్ల మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలె యాదయ్యకే మళ్లీ టికెట్ కేటాయించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కాలె యాదయ్యపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. సర్వేలను మాత్రమే కాకుండా కింది స్థాయిలోనూ ఆయన గురించి తెలుసుకోవాలని కోరారు. నవాబుపేట మండలం నుంచి పార్టీకోసం పని చేస్తున్న ప్రజాప్రతినిధులకు నేటికీ ఎలాంటి గుర్తింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తమను పట్టించుకోకపోగా ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టించారని ఆవేదన వెళ్లిబుచ్చారు. దళిత బంధు, బీసీ బంధుకు డబ్బులు వసూలు చేయడంతో పార్టీకి నష్టం జరుగుతోందన్నారు. పార్టీ పదవులన్నీ తన కుటుంబానికే ఇచ్చుకుంటే పార్టీని నమ్ముకున్న ఎస్సీ, ఎస్టీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దళితులను రాజకీయంగా అనగదొక్కుతున్నారని మండిపడ్డారు. పార్టీ నాయకుల వద్దే డబ్బులు వసూలు చేసి ఎంపీటీసీ టికెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో తమతో పాటు దళితులంతా ఆయనకు మద్దతిచ్చేది లేదని తేల్చి చెప్పారు. పార్టీ టికెట్‌పై అధిష్టానం పునరాలోచించి కేఎస్ రత్నంకు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఈసమావేశంలో నవాబుపేట వైస్ ఎంపీపీ బందయ్య, ఏఎంసీ డైరెక్టర్లు రాములు, జి.గోపాల్, కో అప్షన్‌సభ్యుడు సయ్యద్‌గౌస్, సాయిలు, మాజీ సర్పంచ్‌లు గోపాల్, జైపాల్‌రెడ్డి, పెంటయ్య, బి.గాలయ్య, నాయకులు అశోక్, ఎం.డీ బషీర్, రవీందర్, శేఖర్, లక్ష్మీస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లం, పటిక పట్టివేత



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న బెల్లం పౌడర్, పటిక, ఆటో

కడ్తాల్: అక్రమంగా తరలిస్తున్న బెల్లం పౌడర్, పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాయక్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన కోటయ్య హైదరాబాద్ నుంచి బెల్లం పౌడర్, పటికను ఆటోలో తరలించి కల్వకుర్తి, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో అక్రమంగా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు బుధవారం ఉదయం శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై కర్కల్‌పహాడ్ రాంనుంత గ్రామాల సమీపంలో ఆమనగల్లు ఎక్సైజ్ సిబ్బంది, స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది దాడులు చేపట్టి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 200 కేజీల బెల్లం పౌడర్, 100 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. కోటయ్యను అరెస్ట్ చేసి ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు యాదయ్య, స్వప్న, హెడ్ కానిస్టేబుల్స్ శంకర్, ఈసీ నర్సింహ, తదితరులున్నారు.